ఆశాభంగం

"ఏమండీ, ఏమండోయ్ !...

పరుగులాంటి నడకతో, వంట చేస్తూ, చేత్తో గరిటతో వగరుస్తూ వచ్చింది కమల.

"ఏమండీ,... చూశారా ?.... విన్నారా ?"

పేపరులో తలదూర్చుకు కూర్చున్న రామారావు చూడాలేదు, వినాలేదు.

"అబ్బ ముందిది వినండి," బలవంతంగా చేతిలో పేపరు లాగేసింది కమల.

"ఏమిటి వినటం ?" విసుక్కుంటూ అన్నాడు రామారావు.

"సుశీలా, వాళ్ళాయనా దెబ్బలాడు కుంటున్నారండీ ;" రహస్యం చెప్తున్నట్టు గొంతు తగ్గించి అంది కమల.

"అయితే ఏం చెయ్యమంటావు ? వెళ్ళి విడదీయమంటావా ?" హాస్యంగా అన్నాడు రామారావు.

"అబ్బ ... అదికాదండీ ... పెద్ద — ఎంతో మెచ్చుకుంటారుగా మీరు వాళ్ళని. వాళ్ళు మనలా ఎన్నడూ తగూలాడుకోరనీ, ఇద్దరూ పెద్ద చదువులు చదివినవారు, సంస్కారవంతులనీ ఎంతో పొగుడుతారుగా.... ఆవిడ అంత చదివినా ఎంతో అణుకువుగా వుంటుందనీ, నాలాంటి మిడి మిడి జ్ఞానం వున్నవాళ్ళే, సగం సగం చదివిన వారికే ఈ బుర్రతిరుగుడనీ, నిండుకుండ తొణకదనీ.... ఎంతో మెచ్చుకుంటారుగా ఆవిడని.... వెళ్ళండి, వినండి ! ఎలా దెబ్బలాడు కుంటున్నారో ! ... మనకంటే ఎక్కువగా దెబ్బలాడుకుని, అరచుకుంటున్నారు ;" దెప్పుతూ అంది కమల.

"నిజంగానే? ఏమని దెబ్బలాడు కుంటున్నా రేమిటి?" కొస్త కుతూహలం కనపరిచాడు రామారావు.

"రండి, వినండి; స్వయంగా వింటే మీకే తెలుస్తుంది;...."

ఇష్టం లేకపోయినా కుతూహలం అణుచుకోలేక లేచి వెళ్ళాడు రామారావు.

"అవును నిజమే, నీవూ చదువుకున్న దానివి, నాతో సమానంగా ఉద్యోగం చేస్తున్నదానివి. నా అంతటి దానివి నీవు—మొగుడంటే లెక్క ఏమిటి? మొగుడు ఏదన్నా అంటే పడవలసిన అవసరం నీ కేమిటి?.... అనడం నాదేతప్పు," సుశీల మొగుడు శేఖర్ గొంతు గట్టిగా వినిపిస్తోంది.

"ఎందుకలా నోరు పారేసుకుంటారు అనవసరంగా. నే నేం తప్పుమాట అన్నానని! ఇంటికి వచ్చి గుమ్మంలో అడుగు పెట్టానో లేదో, ఇది సరిగాలేదు, అది సరిగాలేదు. వెధవయిల్లు అని సాధిస్తే నే నేం చేస్తాను. యింటికి వచ్చిన దగ్గిరనించీ విసుక్కుంటే .... నేను మాత్రం మనిషినికానా?.... నేనూ ఉదయమనగా మీతో వెళ్ళిన దాన్నేగా! ఇప్పుడు మీతో సరిగా వచ్చాను. నే నేం పోనీ ఇంట్లో వూరికే కూర్చుని చేయ లేదన్నా బావుంది " సుశీల గొంతు అసహనంగా వినిపించింది.

"ఆ.... చేశావులే మహా ఉద్యోగం. లోకంలో నీ వొక్కర్తివే చేస్తున్నట్లున్నావు. మాట మాటకీ నేనూ మీలా ఉద్యోగం చేస్తున్నానని చెప్ప నక్కరలేదు. ఆ మాట నాకూ తెలుసు ...."

"తెలిస్తే ఎందుకలా మాట్లాడుతారు? ఏం, ఆడదాన్నయితే నా కింకో పది చేతులు ఎక్కువ వున్నాయనుకున్నారా—ఇంటా బయటా ఒకసారే చక్కపెట్టడానికి. మీకంటే, ఇంటికి వచ్చాక అయినా విశ్రాంతి: నాకు అదీ లేదుగా! ఇప్పుడు మళ్ళీ వంటవండాలి. నేనూ మీలా మనిషినే?"

"ఓహో....నీతో సమానంగా ఉద్యోగం చేస్తున్నాను కనక, నాతో సమానంగా వంటచెయ్యాలి" అనా నీ ఉద్దేశం ? అంతేనా ? ఎంత ఉద్యోగస్తురాలైనా ఆడదానివి, నా భార్యవి అని గుర్తుంచుకో — వళ్ళు దగ్గరుంచుకు మాట్లాడు...." రెచ్చిపోయాడు శేఖర్.

"నోటికి వచ్చినట్లు అనవసరంగా మీరు ఏదంటే అది పడేదాన్ని గాదు. నేను మిమ్మల్ని వండమనలేదు. వార్చ మనలేదు. అన్నదల్లా అయినదానికీ కానిదానికీ సాధించవద్దన్నాను," ఆవిడ గొంతు తారస్థాయి అందుకుంది.

కమలా రామారావూ మొహాలు చూసుకున్నారు. "ఇప్పుడేమంటారు" అన్నట్టు చూసింది కమల, ఆశ్చర్య పోయాడు రామారావు. "ఎనిమిది నెలలుగా వుంటున్నా, ఒక్కసారైన గట్టిగా మాటామాటా అనుకోనివాళ్ళు యీ రోజేమిటి యిలా పోట్లాడుకుంటున్నారు. ఏం జరిగింది?" ఆశ్చర్యంగా స్వగతం చెప్పుకున్నాడు రామారావు.

"ఏం అంత చదువుకుంటే మాత్రం మొగుడూ పెళ్ళాలు అన్నాక దెబ్బలాటలు రావా ? అంత ఆశ్చర పడడానికి ఏముంది ?" సందు చూసుకుని చెప్పింది కమల.

సుశీలా శేఖర్ లు ఇద్దరూ ఎం. ఏ. లు, ఇద్దరూ కాలేజీలో లెక్చరర్లు. ఆ ఇంటికి వచ్చి ఎనిమిది నెలలు అవుతూంది. చిన్న భాగంలో కమలావాళ్ళూ, పెద్ద భాగంలో సుశీలా వాళ్ళూ వుంటున్నారు. రామారావు ఏజీ ఆఫీసులో ఎకౌంటెంట్. రెండొందలుయేభై జీతంతో, ముగ్గురు పిల్లలతో సంసారం నెట్టుతున్న సామాన్య సంసారి. కమల డిగ్రీ చదువులు చదవక పోయినా, అభ్యుదయ భావాలు కలది.

అద్దెకు వచ్చిన నాడే సుశీలా శేఖర్ లంటే కమలకీ రామారావుకీ ఇద్దరికీ ఎంతో గౌరవాభిమానాలు కలిగాయి. ఇద్దరూ బాగా చదువుకున్న వారనీ ఇద్దరూ ఉద్యోగస్థులనీ తెలియగానే ఆ గౌరవం యింకా యినుమడించింది. వాళ్ళకి పెళ్ళి అయి నాలు గేళ్ళయింది.

ఇద్దరు పిల్లలనీ చూడటానికి ఆయాని యింట్లో వుంచి, ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఏ గర్వం లేకుండా సరదాగా, కలుపుగోరుతనంగా, ఆత్మీయత కనపరచి మాట్లాడడంతో ఆ రోజునించే రెండు కుటుంబాల మధ్యా మైత్రి ప్రారంభమై, గాఢమైంది, కొద్ది రోజులలోనే. ఆదివారం గాని, శలవరోజుగాని వస్తే రెండు కుటుంబాలు ఒకే ఇంట్లో కాఫీలు, భోజనాలు చేసి నలుగురూ కలిసి పేకాడుకోవడం, సినిమాల కెళ్ళడం, ఏ పిక్నిక్ లకో వెళ్ళి శలవరోజులు ఎంతో సరదాగా గడిపేవారు రెండు కుటుంబాల వారూ. ఎంతో అన్యోన్యంగా వుండే ఆ దంపతులని చూస్తే రామారావుకి ఎంతో ముచ్చట వేసి, కమలని అస్తమానూ దెప్పేవాడు.

"చూడు, ఆవిడని చూడు. అంత చదువుకుంది, ఉద్యోగం చేస్తూంది; అయినా యింట్లో పనిపాటలు చేసుకుంటూ ఎంత పొందికగా వుంటుందో, పిల్లల్ని ఎట్టి అలవాట్లతో పెంచుతుందో చూడు ఎంత కలుపుగోరుతనముగా వుంటుంది గర్వమనేది లేకుండా, ఇన్నాళ్ళయింది ఎన్నడన్నా వాళ్ళిద్దరూ మాటా మాటైనా అనుకున్నారా?.... చూసి నేర్చుకో- అదీ దాంపత్యమంటే?.... నీవో, చదివింది మెట్రిక్యులేషన్నేగాని... ప్రపంచంలో అన్ని విషయాల గురించీ నీకు తెలియంది లేదంటావు? ప్రతీదానికీ అవునంటే కాదనడం, కాదంటే అవుననడం, ఏమైనా అంటే నా మీద విరుచుకుపడడము, ఆ కోపంలో పిల్లల్ని చావకొట్టడం, గిన్నెలు ఎత్తేయడం ఇవేగా నీకు తెలిసింది.... ఇంట్లో మొగుడికీ పిల్లలికీ వండి పెట్టడం ఊరందరికీ ఉపకారములాగ, మహా కష్టపడిపోతున్నట్లు రోజుకి పదిసార్లు విసుక్కోవడం. చూడు, ఆవిడ చూడు ఎప్పుడు చేస్తుందో, ఎలా చేస్తుందో.... పదింటికల్లా అన్ని పన్నులూ చేసి కాలేజీకి వెడుతుంది...." రోజుకి అధమం ఒక్కసారైన రామారావు ఆవిడనీ, ఆవిడ నేర్పునీ, వాళ్ళ అన్యోన్యతనీ గురించి, ఆ ఆదర్శ దంపతులని, పొగడక మానడు. కమలకీ లోపల వాళ్ళంటే గౌరవాభిమానాలు వున్నా, భర్తనోట ఆ పొగడ్తలు విని సహించలేదు.

"ఆ... మీరూ చెప్పడమే! అన్యోన్యత గురించి! ఆయనలా మీరుంటే తప్పకుండా ఆవిడలా నేనూ వుంటాను.... మీ రెప్పుడైనా ఒక్కనాడయినా, వంట్లో బాగుండక చస్తున్నా వంటింట్లోకి తొంగిచూసిన పాపాన పోయారా? జ్వరం వచ్చినా ఇన్ని కాఫీ నీళ్ళయినా నా మొహాన్న పోశారా ఎప్పుడయినా? ఆయన చూడండి, ప్రతిపనికీ ఆవిడకి ఎలా సాయపడతారో? ఉదయం లేచి ఒకరు కాఫీ కలిపితే, ఇంకోరు టిఫిన్ చేస్తారు. ఆయన చకచక కూరలు తరుగుతే ఆవిడ అన్నీ కుక్కరులో పడేస్తుంది. ఆయన ప్లేట్లు సవరిస్తే ఆవిడ వడ్డిస్తుంది. ఆవిడ వంట చేస్తూంటే ఆయన ఆయా చేత పిల్లలికి నీళ్ళు పోయించి, ముస్తాబు చేస్తాడు. ఇద్దరూ కలిసి చకచక అన్నిపనులూ చేసుకుంటారు. ఏం, ఆయన మాత్రం ఉద్యోగం చేయడం లేదేమిటి? పెద్ద మీరే మగవాడి నన్నట్లు, మగతనానికి అవమానం అన్నట్లు యిటు పుల్లతీసి అటు పెట్టరు... చస్తున్నా అటు చూడరు.... అంతగా అయితే ఒక క్యారియరు తెచ్చి నా మొహాన్న పడేస్తారు.... గాస్‌స్టౌవ్, ప్రెషరు కుక్కరులతో ఆవిడ అరగంటలోనూ చేస్తుంది అర నిముషంలోనూ చేస్తుందివంట. మండనికర్రలూ, తడిపొగులూ, ఏడ్చే పిల్లలూ – అన్నీ ఒక్కర్తినే చూసుకోవాలి. ఆవిడలా నేనెలా చేస్తాను. ఇద్దరూ కలిసి ఆర్జిస్తున్నారు. దర్జాగా ఖర్చుపెడ్తారు. రోజుకో చీరతో నీటుగా ఆవిడ కాకపోతే నేనెలా అవుతాను ముస్తాబు!... పదిసార్లు అడగ్గా అడగ్గా ఏడాదికో ఆరు చీర్లో కొనడానికి బ్రహ్మాండం చేస్తారు... పైగా... ఆవిడతో నన్ను బోల్చడానికికైనా సిగ్గుండాలి! ఏదీ పోనీ ఆవిడలా నాకు డిగ్రీలు లేకపోయినా, ఏదో మెట్రిక్ ప్యాసియ్యాను గదా, ఓ గుమస్తా ఉద్యోగం దొరక్కపోదు ఏదైనా ఉద్యోగం చూడండి చేస్తాను అక్కడితో వదులుతాయి ఆదర్శాలూ, ఆశయాలూ అంటూ పెద్దకబుర్లు!" అంటూ కడిగేస్తుంది కమల. జవాబు చెప్పలేక గుటకలు మింగుతాడు రామారావు.

"ఏం మాట్లాడరేం? అబ్బే తనదాకా వచ్చేదాకానే యీ కబుర్లు. పెళ్ళాంచేత ఉద్యోగం చేయించే టంత సంస్కారం ఎంతమంది మగవాళ్ళకి వుంటుంది?... అందులో మీరా? అయ్యో రామ! ఒకవేళ

ఉద్యోగం చేయించిన ఆయనలా ఇంటి పని చేస్తారా?... యిటు యింటి చాకిరీ, అటు ఆఫీసు పనీ అన్నీ నా నెత్తిన రుద్దుతారు తప్ప, అలాంటి సహకారం మీ రెక్కడ యిస్తారు?.... ఆయనలా మీ రెక్కడ వుండ గలరు?.... అంచేత ఆవిడతో నన్ను పోల్చకండి .... "అంటూ గంయ్ మంటుంది కమల.

"చాల్లే.... పెద్ద చేస్తావు ఉద్యోగం! స్కూలు ఫైనలు చదువుకేనా నెత్తినెక్కి తొక్కుతున్నావు! ఇంకా ఉద్యోగంచేస్తే నన్ను నిల్వనిస్తావా! వెళ్ళు వెళ్ళు ఆ కూర ఏం మాడి తగలడిందో చూడు .... మన దెబ్బ లాట రోజూ వుండేదే! అంటూ అనవసరం కోపం నటిస్తాడు.

రోజుకోసారి రామారావు వాళ్ళని పొగడకా మానడు, కమల దెప్పకా మానదు. అయినా ఇద్దరికీ లోలోపల ఆశ్చర్యంగానే వుండేది. ఎంత అన్యోన్య ధంపతులైతే మాత్రం ఒక్కసారైనా మాటామాటా అనుకో కుండా ఎలా వుంటారు?" అన్న సందేహం వచ్చేది. అందుకే ఇద్దరూ ఈ రోజు వాళ్ళ దెబ్బలాటవిని ఒకరిని మించి ఒకరు ఆశ్చర్య పడ్డారు —

—"బాబుని చూడు! ఎలా వున్నాడో? నీ కసలు యింటి సంగతీ పిల్లల సంగతి ఏమైనా పడుతుందా? పిల్లల్ని కనగానే సరికాదు. వాళ్ళని సక్రమంగా పెంచాల్సిన బాధ్యతకూడా వుందని గుర్తుంచుకో ఆయినా నా వెర్రికాని, నీకు పిల్లల్ని చూడవలసిన అవసరం ఏమిటి?.... పెద్ద ఉద్యో గస్థురాలివి, ఆయాని పెట్టావుగా వాళ్ళ కోసం. ఏదో, కన్నావు సరి పోయింది. ఇంక వాళ్ళు గాలికి పెరుగుతారులే" హేళనగా అంటూన్న శేఖర్ మాటలు కమల, రామారావు కుతూహలంగా వినసాగారు.

"... ఏమిటి మీ ఉద్దేశం? ఊరుకుంటున్న కొద్దీ ఎందుకు కావాలని నన్ను రెచ్చగొడ్తున్నారు!" తీక్షణంగా ఉంది సుశీల గొంతు.

"అవును, కావాలనే కల్పిస్తున్నాను. చూడు, బాబువంక ఒకసారి చూడు; ఆ బట్టలు, ఆ వళ్ళు ఎలా మట్టిగొట్టుకుని వున్నాయో చూశావా? ఎన్నాళ్ళయింది వాడికి నీవు శుభ్రంగా తల దువ్వి, నీళ్ళుపోసి, అన్నీ ఆయామీద వదిలేయడం, దాని దయాధర్మాలమీద వాళ్ళు ఆధార పడడం, .. పాప చూడు అలా గంటనించీ తడిబట్టల్లో పడుకున్నా నీకు కనిపించిందా? పిల్లలిద్దరూ ఎలా దిక్కులేని వాళ్ళలా వున్నారో.... యివేవీ నీకు కనపడ్డంలేదా? ఎంత ఉద్యోగస్థురాలివైనా, నీవూ ఒక తల్లివే...."

"ఓహో! నేను తల్లినేగాని, మీరు తండ్రికాదు గాబోలు. నాకేగాని మీకే బాధ్యతా లేదుగాబోలు! నా కొక్కరికే గాబోలు పిల్లలు... నేను వంటింట్లో వున్నాను .. బాబు అంత మట్టిగొట్టుకు వుంటే కాస్త కడిగి బట్టలు తొడిగితే తప్పా? పాప ప్రక్కబట్టలు మారుస్తే మీ ఘనత్వానికి అవమానం గాబోలు. అన్నీ నే నొక్కర్తినే చూసికోవాలా? చచ్చీచెడీ రోజంతా కాలేజీలో అరచి ఇంటికివచ్చి .. మళ్ళీ నిమిషం తెరిపిలేకుండా వంటా అదీ చూస్తున్నానే, మీరా మాత్రం చేస్తే తప్పా?"

"నోర్ముయ్ అంత వరకు వచ్చిందన్నమాట వ్యవహారం! .. యివాళ పిల్లల బట్టలు తీయమంటావు, రేపు వాళ్ళ దొడ్లు ఎత్తమంటావు! .. కాస్త వళ్ళు దగ్గిరుంచుకో! నీ వెంత చదువుకున్న దానివైనా, ఉద్యోగస్తురాలివైనా .. కట్టుకున్న మొగుడిని అవమానించి మాట్లాడితే సహించే ఓర్పు నాకు లేదు."

"ఎంత మీ భార్యనైనా, ప్రతిదానికీ రాద్ధాంతం చేస్తూంటే పడి వుండే ఓర్పు నాకూలేదు. నా విధులు, నా బాధ్యతలు నాకు తెలుసు. మీరేం ప్రతిదానికీ గుర్తు చేయ నక్కరలేదు." తీవ్రంగా వుంది సుశీల గొంతు.

—వింటూన్న రామారావూ, కమలా ఆశ్చర్యంతో చూసుకున్నారు. ఎన్నడూ గట్టిగాకూడా జవాబీయని ఆవిడ, భర్తకి ఎంతో గౌరవమిస్తూ

నమ్రతగా వుండే ఆవిడ ఏమిటి యివాళ ఇంత దురుసుగా మాట్లాడుతూంది!.... ఆయన మాత్రం భార్యని ఎంతో ప్రేమగా అభిమానంగా చూస్తూ, అన్నింట్లో సహకరిస్తూ, కావాలని ఉద్యోగం చేయించే మనిషి యివాళ ఎందుకిలా ఆమెని కించపరుస్తున్నాడు? అసలు యిద్దరూ పిల్లల్ని ఎంతో శుభ్రంగా వుంచి, మంచి శిక్షణలో పెంచుతారు. సగం పిల్లల పని అంతా అతనే చూస్తాడు రోజూ. ఇవాళేమిటి ఇలా అంటున్నాడు? ఏం అయింది ఇద్దరకీ? అసలు తప్పు ఎవరిది?.... ఎందుకొచ్చింది అసలు తగువు! !— ఎంత ఆలోచించినా ఏం తేల్చుకోలేకపోయారు ఇద్దరూ. ఇంకా పూర్తికాని ఆ సంభాషణ ఈసారి మరింత శ్రద్ధగా వినసాగారు ఇద్దరూ, నిశ్శబ్దంగా చూపులతోనే ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ!—

—"బీరువా నిండా అన్ని చీరలు మూలుగుతూంటే మళ్ళీ ఏం అవసరం అని నూటఏభై పెట్టి చీర కొన్నావు? ఇంకా ఈ నెల ఖర్చులు అన్నీ అలాగే వున్నాయి. ఏం తొందర వచ్చిందని చెప్పకుండా చేయకుండా ఇలా ఖర్చుపెట్టేశావు?"

"ప్రతి దమ్మిడీకి లెక్కచెప్పాలా? ఆ మాత్రం ఖర్చుపెట్టే స్వాతంత్ర్యం నాకు లేదా? అన్నింటికీ సంజాయిషీ ఇచ్చుకోవాలా? ప్రతీదానికీ ఇంట్లో రాద్ధాంతమే!"

"అవును అన్నింటికీ రాద్ధాంతంలాగే కన్పిస్తుంది నీకు... ఇద్దరం సంపాదిస్తున్నా, దమ్మిడీ నిలవలేదు యిప్పటివరకు! అసలు నీకేమైనా యింటి ఖర్చుల సంగతి తెలుస్తుందా? ఒళ్ళూపై తెలియకుండా రాబడి కంటె ఎక్కువ ఖర్చులు పెడుతున్నావ్ తెలుసా. అన్నీ సమర్ధించుకోలేక నేనెంత సతమత మవుతున్నానో తెలుసా?"

"ఎందుకన్ని మాటలంటారు అనవసరంగా. లేటెస్ట్ పాషన్ చీరలు వస్తే నాలుగు తీసుకున్నాను తప్పా? ప్రతిదానికీ ముందు మీ పర్మిషన్ లేకుండా ఏం చేయకూడదా? ఏదో అంత బరువూ మీరొక్కరూ మోస్తున్నట్టు. నే నేదో ఊరికే తిని కూర్చుని డబ్బు తగలేస్తున్నట్టు

మాట్లాడుతున్నారు. నేనూ మీతో సమానంగా సంపాయించి మీ చేతుల్లోనే పెడుతున్నాను అంతా. ఆ మాత్రం బరువులూ, బాధ్యతలూ నాకూ తెలుసు...

"ఓహో ... అంతవరకు వచ్చిందన్న మాట నీ డబ్బు నా డబ్బు అన్నంతవరకు వచ్చిందన్న మాట ...ఇవాళ నీ డబ్బన్నావు ... రేపొద్దున ఆడదాని డబ్బు తింటున్నావంటావు. ఇంతకీ నాదే తప్పు ... యీ నెలనించీ నీ డబ్బు నాకు దమ్మిడీ యీయవద్దు. బేంకులోదాచుకో .... చీరలే కొనుక్కుంటావో, నగలే చేయించుకుంటావో !—"

"ఛీ.... మీరెందుకిలా తయారవుతున్నారు రోజు రోజుకీ ... ముచ్చటపడి నాలుగు చీరలు కొనుక్కున్నందుకు ఎంత గొడవ చేస్తున్నారు బైటికి వెళ్ళి ఉద్యోగం చేయవలసిన దానిని కాస్త మంచి చీరలు వుండాలని కొనుక్కోడం, ఎంత రాద్ధాంతానికి కారణం అయింది."

"అవును, రోజుకో చీర గట్టి నీ అందాన్ని అందరికీ చాటుకో వద్దా మరి ! ఆ పార్థసారధి.... శర్మా.... అందరూ నీ చుట్టూ చేరొద్దా !!

"ఏమిటి మీరనేది ?" ఆశ్చర్యంగా అంది సుశీల.

"నేననేది పాపం నీకు తెలియనట్లు వుంది ! స్టాఫ్ రూములో గంటలకొద్దీ పార్థసారధీ, శర్మలతో వికవికలు పకపకలు_ అవన్నీ నాకు తెలియదనుకున్నావు గాబోలు...."

"ఏమిటి మీరు మాట్లాడేది ?" అత్యాశ్చర్యంతో ధ్వనించింది సుశీల గొంతు.

"ఎందుకు అమాయకత్వం నటిస్తావు యింకా ? ఏమిటా అంతూ పొంతూలేని కబుర్లు నీకు మగవాళ్ళతో ? రోజూ చూస్తున్నాను.... బొత్తిగా మంచీ చెడ్డాలేకుండా, అసహ్యంగా, ఆడదాన్నని మరచిపోయి, మగవాళ్ళతో సమానంగా ఏమిటా నవ్వులు, ఆ మాటలు.... ?"

"ఏమిటి మీ ఉద్దేశం! మాట్లాడితే తప్పేమిటి? ఐనా తీరిక సమయాల్లో తోటి లెక్చరర్లతో మాట్లాడడం తప్పా? శర్మ, పార్థసారథీ యిద్దరూ తమాషాగా మాట్లాడతారు కనక వాళ్ళతో ఎక్కువ మాట్లాడతాను. అందులో ఏం తప్పుంది? అయినా, నలుగురిలో ఉద్యోగం చేస్తూ ఎవరితో మాట్లాడకుండా ఎలా వుంటాను? అయినా మీకీ అనుమానాలు, అపార్థాలు ఏమిటి అన్నింటికీ, నాకీ ఆంక్షలేమిటి? ఆ మాత్రం మంచీ మర్యాదా నాకు తెలియదా? మాట్లాడినంత మాత్రాన ఎవడితోనూ లేచిపోను" అసహనంగా, విసురుగా అంది సుశీల.

"చాల్లే, యింకా సమర్థించుకుంటున్నావు? నీ వ్యవహారం అంతా కనిపెడుతున్నాను. నీ వరసంతా చూస్తున్నాను. నాకేం నచ్చలేదు నీ సంగతి. నీ వెంత ఉద్యోగస్థురాలివైనా, నా భార్యవని గుర్తుంచుకో. నా భార్య మానాభిమానాలు విడిచి ప్రవర్తించడం నేను సహించను."

"నా మానాభిమానాలు కాపాడు కోవడం మీకంటే నాకు ఎక్కువ అవసరం. ఆ సంగతి నాకు తెలుసు.... మగవాడితో మాట్లాడితే మానాభిమానాలు పోతాయని నాకు తెలియదు అందులో భర్తకి భార్య చేసే ద్రోహం ఏం వుందో నాకు తెలియదు. భర్తకి భార్య ఎంత విశ్వాసంతో వుండాలో భర్తా భార్యకి అంత విశ్వాసంతో వుండాలని పాపం మీకు తెలియకే గాబోలు.... ఆ సుహాసినీదేవితో అలా తిరుగుతారు; పద్మావతితో అలా గంటలకొద్దీ బాతాఖానీ కొడ్తారు.... సరళాదేవికి నోట్సులు ప్రిపేరు చేసియిస్తారు – ఆవిడ కటాక్ష వీక్షణాల కోసం... నాకూ తెలుసు అపార్థాలు తీయడం.... మాటలనడం!.... అయినా నేను మీలా అంత హీనంగా, ఆలోచించను!" వెటకారంగా అంటూంది సుశీల.

"నోర్ముయ్.... ప్రతిదానికీ మగవాడితో పంతా నీకు?" రెచ్చిపోయాడు శేఖర్.

"ఛా మీలాంటి మనుష్యులతో నాకు మాట లేమిటి? పైకి పెద్ద అభ్యుదయవాదుల్లా, సంస్కారవంతుల్లా, నటించడం.... యింట్లో యిదీ వరస! ఆడదాని అభ్యుదయం కాంక్షించేవారులా స్త్రీలు, సమాన హక్కులు, ఆదర్శాలు, ఆశయాలు అంటూ పెద్ద కబుర్లు ఏమిటో మాట్లాడి, "డిగ్రీ వుండి యింట్లో ఎందుకుకూర్చోవడం" అని ఉద్యోగంలో ఎందుకు ప్రవేశపెట్టారు? సంస్కారవంతుల్లా!.... ఆడది తనతో సమానంగా సంపాయిస్తే ఓర్చుకోలేనివారు, భార్య ఉద్యోగంచేస్తే చిన్నచూపు చూస్తుందని భ్రమపడేవారు.... భార్య పరాయి మగవాడితో మాట్లాడితేనే సహించలేనివారు .. యీ ఉద్యోగం ఎందుకు చేయమన్నారు?.... ప్రతీ మాటలో, ప్రతీ చేష్టలో విపరీతార్థాలు తీస్తూ యిల్లు నరకం చేస్తున్నారు? ఏం, నేను చదువున్న దాన్నని క్రొత్తగా తెలిసిందా? ప్రతి మాటకీ చదువుకున్న దానివని ఎత్తిపొడవడం, ఉద్యోగస్థురాలివని హేళన చేయడం ఏమిటిదంతా! అంతే, తనదాకా వస్తేగాని తెలియదు గాబోలు! తనతో సరిసమానంగా వుండడం ఏ మగవాడు సహించలేడు గాబోలు. తనదే పైచేయిగా వుండాలనుకునే అంత అహం ఎందుకో మగవాడికి?" సుశీల గొంతు ఆవేశంతో వణికింది.

"ఛీ.... రోజూ నేనీ నరకం ఇంక భరించలేను. నా కెందుకీ కష్టం, నిష్ఠూరం ... హాయిగా యింటిపట్టునే కూర్చుంటాను.... చాలీచాలని జీతంతో బాధపడినపుడుగాని, నా విలువ మీకు తెలియదు.... నేను రేపే యీ ఉద్యోగము రిజైను చేస్తున్నాను;" ధృఢంగా అంది సుశీల.

—"చాలా దూరమే వచ్చింది అన్నమాట వ్యవహారం...." రామం నిట్టూరుస్తూ అన్నాడు అంతా విని, లోపలిగదిలోకి వెడుతూ.

"అలాగే చేయాలి ఆవిడ.... అప్పటికిగాని తెలిసిరాదు అతనికి. ఓ రెండు మూడు నెలలు డబ్బు యిబ్బంది పడితేనేగాని ఆవిడ విలువ తెలియదు అతనికి.... అయినా ఎప్పుడు పోతుందీ మన దేశంలో యీ స్త్రీ, పురుషుల తేడాలు, హెచ్చుతగ్గులు. ఈ మగవారి జులుము, అధికారాలు ఎప్పటికి పోతాయో! ఎంత చదువుకున్నా స్త్రీ తనతో సమానంగా

వుండకుండా, కిందనే వుండాలనే యీ మగవారి అహంనించి ఎప్పటికీ విముక్తి." ఉపన్యాస ధోరణిలో ఆవేశంగా అంది కమల.

"ఆ .... ఆ .... చాల్లే అవకాశంవస్తే చాలు. లెక్చర్లు దంచు తావు మగవాళ్ళ దురన్యాయాల గురించి...." విసుక్కున్నాడు రామారావు.

*　　*　　*

"ఏమండీ, భోజనాలయ్యాయా ?... ఓ రౌండు రమ్మీ ఆడుదామా ? తీరుబాటుగా వుంది యివాళ. రేపు క్లాసులన్నీ యించుమించు విరామమే.... రండి ఓ గంట ఆడదాం." అంటూ రాత్రి ఎనిమిది గంటవేళ వచ్చిన సుశీలా శేఖర్లని చూసి కమలా రామారావు విస్తుపోయారు. ఇద్దరూ ఏం జరగనట్టే. నవ్వుకుంటూ వచ్చిన ఆ దంపతులని చూసి "వీళ్ళేనా రెండుగంటల క్రితం అంతలా తగువులాడు కున్నారు." అన్నట్టు మొహాలు చూసుకున్నారు. "ఇద్దరూ, అంతలా దెబ్బలాడుకుని అప్పుడే ఒకటెలా అయ్యారు ?"....తామిద్దరూ మాటామాటా అను కోవడంతో మొదలై చిలికి చిలికి గాలివాన అయి, ఆయన కేకలు వేయడం, తను ఏడవడం, ఆయన కాఫీ మానితే, తను భోజనం మాని రెండు మూడు రోజులు ఎడమొహం పెడమొహములు, తరువాత కుర్చీలనీ, గోడలనీ, పిల్లల్ని మధ్యవర్తులుగా వుంచి మాట్లాడడం .... తరువాత చల్లబడడం .... ఇంత గ్రంధం జరుగుతుంది .... అలాంటిది .... వీళ్ళేమిటి గంట క్రితం చచ్చే టట్లు దెబ్బలాడుకుని, మామూలుగా నవ్వుకుంటూ ఎలా మాట్లాడుకో గలుగుతున్నారు. పేకాడుతున్నంత సేపు సుశీలా శేఖర్లను పరిశీలనగా చూస్తున్న కమలా, రామారావుల సందేహం అది. సందేహం సందేహం లాగే వుండిపోయింది ఆ పూట.

*　　*　　*

"అయితే, నిజంగానే మీరు ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నా రేమిటి ?" మర్నాడు ఆదివారం కూరల మార్కెట్టుకు వెళ్ళే త్రోవలో

సుశీలని అడిగింది కమల. అడిగాక గబుక్కున నాలిక కరుచుకుంది పొరపాటు గ్రహించి వాళ్ళ దెబ్బలాట విన్నామని నొచ్చుకుంటుందేమో — తొందరపడి అడిగానని బాధపడింది కమల.

సుశీల ఆశ్చర్యంగా చూసింది. అర్థంకానట్టు "ఎందుకు ? నేను రాజీనామా చెయ్యడం ఏమిటి ?....ఎవరు చెప్పారు ?"

కమల సర్దుకుంటూ గాబరాగా అంది : "అబ్బే .... నేనే అంటున్నాను. మీకు యింటిపనీ, అటు కాలేజీపనీ కష్టంగాలేదూ ! అందుకు పని మానేస్తారేమో అనుకున్నానని." ఏదో యధాలాపంగా అడిగినట్లు సర్ది చెప్పింది.

"అబ్బే నాకిది అలవాటే... నాలుగేళ్ళనించీ చేస్తున్నదేగా !.... ఇవాళ క్రొత్తగా వచ్చిన యిబ్బంది ఏముంది ?.... అయినా అంత కష్టపడే పనేముంది ? ఆయన సగంపని సాయం చేస్తారు .... మిగతా పన్లకి మనిషి వుండనే వుంది ... ఉద్యోగం మాని రోజంతా నేను చేసే పాటేముంది ? ...డిగ్రీ వుండి వూరికే కూర్చోవడ మెందుకు ?.... ఏం వచ్చినా రావడమేగా.

"ఆ... నిజమే " ఏదో అంది కాని, కమల లోలోపల చాల ఆశ్చర్యపోయింది. నిన్న అంత ఖచ్చితంగా రాజీనామా చేస్తానని చెప్పిన మనిషి యివాళ యిలా అంటుందేమిటి ? అయినా వీళ్ళు చాల గమ్మత్తు మనుషులు ! లోపల ఎంత కొట్టుకు చస్తున్నా.... పైకి ఎంత అన్యోన్యత నటిస్తున్నారు." అనుకోకుండా వుండలేక పోయింది కమల.

* * *

మీరిద్దరూ తప్పక రావాలిసుమా, ఇవాళ కాలేజీ పంక్షన్‌కి. మంచి నాటకాలు, వివిధ వేషధారణలు వున్నాయి." మర్నాడు ఉదయం సుశీల అంది కమలా వాళ్ళతో.

"ఏం వేషధారణలు. ఎందుకు ?"

"అదే .... రక్షణ నిధికి మా స్టాఫ్ అందరూ కలసి నాటకాలు వేషధారణలు ఏర్పాటు చేశాం," అంటూ రెండు ఐదు రూపాయల టిక్కట్లు కొనిపించింది సుశీల. "ఒక నాటకంలో మేమిద్దం కూడా వేస్తున్నాం. తప్పక రావాలి సుమా!" మళ్ళీ గట్టిగా చెప్పింది సుశీల.

"ఏం నాటకం?" కూతూహలంగా అడిగింది కమల.

"అబ్బే. ఇప్పుడే చెప్పేస్తే ఎలా? సస్పెన్సు.... చూస్తారుగా," నవ్వింది సుశీల.

"ఆ.... అంత సస్పెన్సు ఏముందిలెండి. నిత్యజీవితంలో తటస్థపడే కథే యీవిడే రాసిందిలెండి ఆ నాటకం అందులోనూ మేమిద్దరము భార్యాభర్తలమే. "నిజజీవితంలో మీరిద్దరూ భార్యాభర్తలు కాబట్టి నాటకంలో వేస్తే సహజంగా వుంటుందని అందరూ బలవంతపెట్టారు." శేఖర్ అన్నాడు.

"ఇంతకీ విషయం ఏమిటి?" రామారావు అడిగాడు.

"ఏముంది వివాహిత స్త్రీ.... ఉద్యోగం చేస్తే ఆమె ఎదుర్కొనే సమస్యలు, ఆమె యిటుయిల్లు, అటు ఆఫీసుపని సక్రమంగా చక్కబెట్టగలదా? ఆమెకి భర్త సహకారం వుంటుందా? భర్త ఆమెని తనతో సమానంగా గౌరవించగలడా? అందువల్ల ఆమె సంసారంలో విపరీత పరిణామం వస్తే ఆమె అన్నీ తట్టుకుని ఎదుర్కొని నెగ్గుకు రాగలదా?.... మొదలైన అంశాలమీద నాటకం.... ఆ నాటకంలో మా రిహార్సిల్స్ చూసి చాలా సహజంగా వుందని అందరూ మెచ్చుకున్నారు.... పాపం యీ దెబ్బతో ఉద్యోగం చేసే ఆడవాళ్ళ మొగుళ్ళందరికీ బుద్ధి తెప్పించి, వాళ్ళ తప్పులని తెలిసికొనేటట్టు చేయాలని మా ఆవిడ చాలా కష్టపడి రాసింది ఘనంగా. ఎంతవరకు తేలుతుందో యీవిడ యత్నం".... వేళాకోళంగా అన్నాడు శేఖర్.

"ఆ.... బుద్ధి తెచ్చుకోవడం ఎలావున్నా.... కనీసం వాళ్ళ తప్పు లని వాళ్ళు గ్రహిస్తే అంతేచాలు.... నా ఆశయం నెరవేరినట్లే?.... వస్తారుగా తప్పక?" సుశీల ఇంకోసారి హెచ్చరించింది.

ఇద్దరూ వెళ్ళిపోయాక ఏదో అర్థం అయినట్లు మొహాలు చూసుకున్నారు కమలా, రామారావులు. ఆ మిగిలిన సందేహం కాస్తా. రాత్రి నాటకం చూశాక తీరిపోయింది. రామారావు గర్వంగా "చూశావా, నే చెప్పలా, వాళ్ళు ఎలాగైనా ఆదర్శదంపతులని - యిప్పుడైనా వప్పుకుంటావా?.... త్రోవలో అన్నాడు కమలతో. కమల కళ్ళలో కాస్త ఆశాభంగం కన్పించినా, తేలికగా నవ్వేసి వూరుకుంది.